# కలసి విడిన వెలుగు కణాలు

బస్సు వేగంగా పరుగిడుతోంది.

రెండంతస్తుల బస్సు కిటికిలోంచి తొంగి చూస్తోంటే కింద కదిలే జనంకంటె తానొక పెద్ద అంతస్తులో ఉన్నట్లు ఏదో తేలికగా పగటికల శేఖరాన్ని అల్లుకుంది.

ఎత్తుగా విమానంలో, గాలిలో. ఊగిపోయే సర్కస్ మనిషిలా కొంచెం గర్వంగా భూమివైపు కలయ చూశాడు.

ఆమె కనిపించింది నడుస్తూ ... తెల్లని చీరలో... ఏదో ఆలోచనతో ఎవరో వ్యక్తిని అనుసరిస్తూ ... భూమి మీాది మనుష్యులంతా తనకంటె తక్కువ స్థాయి అనుకున్న శేఖరం ఊహాగానం చెదిరిపోయింది.

ఒకప్పుడు ఆమెకు పాదాక్రాంతుడైన శేఖరం అర్థం చేసుకున్నాడు. ఆమె భూమి నంటిపట్టుకుని క్షేమంగా నడుస్తోంది. తాను గాలిలో ఎత్తుగా కదులు తున్నాడు- ఏ ప్రమాదానికైనా ఎప్పుడైనా గురికాక తప్పదు.

ఆమె నడిచింది. నడచి నడచి ఆగింది బస్సు స్టాండు వద్ద, ఒక చెట్టునీడలో శేఖరం బస్సు దిగాడు ... ఎదురుగుండా బస్సు స్టాండులో చెట్టునీడలో నిలుచున్న ఆమె వెలుగునీడల రంగుల్లో మెరిసిపోతోంది... ఆకుపచ్చ చెట్టు నీడలో పట్టపగలు నిలుచున్న అప్సరసలా అగుపడింది ఆమె. ఆమెను అనుసరించిన వ్యక్తిని చూశాడు శేఖరం.

ఆమెను పలుకరించాలనుకున్న శేఖరం తన ఆలోచన మానుకున్నాడు. బహుశా ఆమె తన్ను మరిచిపోయి ఉంటుంది. వివాహమయిన ఆమె, భర్తతో, పిల్లలతో, నూత్న కుటుంబ వాతావరణంలో, నిత్యగృహ సమస్యలతో, ఉద్యోగం చాకిరీతో, ఎక్కడ జ్ఞాపకం శేఖరం! నిజం! ఖాళీలేని ఆమె మెదడులోకి బలవంతంగా దూరడం అభాసుకావచ్చు ననుకున్నాడు శేఖరం.

ఆమె నిలుచున్న బస్సు స్టాండుకు ఎదురుగా రోడ్డు మీద నుంచి నడుస్తున్నాడు శేఖరం.

ఆమె గమనించి పిలవగలదని ఆశ పడ్డాడు.

ఆమె కొంగు నవరించుకుంది. మేలిముసుగు వేసుకుంది.

బహుశా తనదృష్టినుంచి తప్పించుకోవాలని ఆమె కోరిక కాబోలు! కానీ, ఆ కోరికకు తానెందుకు అడ్డురావాలి. శేఖరం మౌనంగా కదిలిపోయాడు ... ఆమె కనుసన్న దూరంలో కనిపించలేదు... అయినా శేఖరం ముందుకు పోలేక ఆగిపోయాడు... ఎదురుగా కిళ్లీదుకాణం దారునిచేరి ఒక సిగ రెట్టు ముట్టించాడు ... ఎవరికోసమో నిరీక్షిస్తున్నట్లు ఏం చేయాలో తోచక నుంచుండిపోయాడు. రెండంతస్తుల బస్సు అప్సరసలాంటి ఆమెను ఎత్తుకుని ఎగిరిపోయింది.

శేఖరం కూడా అదే అనుకునేవాడు-ఎప్పుడైనా ఎలా గైనా యిలా ఆమెను ఎత్తుకుని పరారి అయిపోతే! ఎంత ఆనందంగా ఉంటుంది. చంటిపిల్లను ఎత్తుకుపోవచ్చు, ఎదిగిన యువతిని ఆమెకు తెలియకుండా ఎలా ఎత్తుకు పోవడం ?

ఈ నాగరిక ప్రపంచంలో రాక్షసులు లేకపోవడం, గంధర్వులు, కిన్నెరులు శాపగ్రస్తులై ఈ భూలోకంలో తనకు తారసిల్లక పోవడం, చాలా బాధ అనిపించింది శేఖరానికి, శాపగ్రస్తులైన వారు కనిపిస్తే, వారి శాప విమోచనానికి తాను కారకుడై, వారి నుంచి వరం కోరుకొనగానే ఫలానా ఆమెను శయన మందిరం నుంచి శయ్యాసహితంగా మేఘాల ద్వారా దాటి చాటుగా తీసుకువచ్చి తనకు అప్పజెప్పమని కోరేవాడు... లేదా తన తిరుగుడులో ఏదైనా మాయరాయి గబుక్కున గగిలితే, ఆ రాయిలోంచి పెద్ద పొగవస్తే...

ఆ పొగలోంచి ఒక రాక్షసుడు కనిపిస్తే, వాడిని కోరేది ఏమిటి?... అతని భుజం ఎక్కి ఎక్కడ ఆమె వుందో గాలిలో తిరిగి గాలించి, పట్టుకొని, మంచం సహితంగా ఆకాశంలోకి ఎత్తుకుపోయి ఏ కీకారణ్యంలోనో పెద్దభవనం కట్టించి ఒంటరి జంటగా హాయిగా జీవితం గడప గలడు.

వెళ్ళిపోయిన రెండంతస్తుల బస్సు రేపిన దుమ్ము ముఖంమీదకు రాగా జేబురుమాలుతో తుడుచుకుని, బస్సును తిట్టుకుని చీదరించుకుని నడిచాడు.

మనస్సులో రేగిన ఆ బస్సులోని ఆమె ప్రణయ అనురాగ దుమారం అతని కార్యక్రమం చెడగొట్టింది. ఏ పనీ చేయకుండా పిచ్చి వాడిలా పాడుకుంటూ ఏదో వీధి కంకర రాళ్లు, గులకరాళ్ళు ఏరి విసురుకుంటూ, ఏ చెట్టు నీడలోనో దొర్లుకుంటూ, కాలక్షేపం చెయ్యాలనిపించింది శేఖరానికి. కాళ్ళీడ్చుకుంటూ నడిచాడు.

ఎదురుగా పెద్దపార్కు.. అనంతమైన పార్కు, ఎందరో వ్యక్తులు. పట్టపగలు ఎండలో బికారులు సేదదీర్చుకుంటూ... బాటసారులు చోద్యం చూసుకుంటూ... అక్కడక్కడ చెదరిపోయి పనిలేనివ్యక్తులు, ఒంటరిగా ఏదో ఆలోచించుకుంటూ కూర్చున్నారు. వారిలోకి శేఖరంకూడ చేరాడు.

అక్కడక్కడ చెదిరి కూర్చున్న వాళ్ళంతా తనలాంటి భగ్న ప్రేమికులేనా? వేరుసెనగ అమ్మేవాడు పలకరించాడు. ఒక పొట్లం కొన్నాడు శేఖరం. ముందుకు నడిచాడు. చెట్లు, చెట్లమధ్య కొలను, కొలనులో తామర తంపరలు తేలు తున్నాయి. మధ్యలో కొంగలు, నీటిపక్షులు ఎగురు తున్నాయి. కొలను నీడ బెంచీలో కూర్చున్నాడు శేఖరం. ఆకాశంలో మేఘాలు దివ్యంగా ప్రకాశిస్తున్నాయి. కాని చాలా దూరం... చేతికందని దూరం. ఆ అందని మేఘంలా ఆమె ప్రకాశించింది.

ఆ చెట్టు నీడలో ఆ బస్సుస్టాండువద్ద...

వేరుసెనగపొట్టు రాలింది. క్రిందకొలను నీటిలో తేలింది... పనికిరాని చెత్త నీటిలో తేలినట్లు జీవిత ప్రవాహంలో తన పనికిరాని బ్రతుకు తేలుతోంది.

ఆమె యిక్కడ కనిపిస్తే !

"ఏమిటి యిక్కడ కూర్చున్నారూ" ఆమె ప్రశ్నించింది.

"ఏం చేస్తా?... ఎక్కడ కూర్చుంటే ఎవరాదరిస్తారు నన్ను?"

"నే నున్నాగా?"

"అందుకేనా దూరంగా పోయావు మరొకరిని పెళ్ళి చేసుకుని?" ఆమె నవ్వింది పక పక. శేఖరం ఏమనుకుంటాడో అని... ఆపింది నవ్వు మధ్యలో, పెదాలు బిగి బెడుతూ మందస్మితం చేసింది.

శేఖరం జుట్టు నిమిరింది.

శేఖరం చకితుడైనాడు. తన్ను విడిచిన ఆ స్త్రీ ఆమె-తన దగ్గరికి వచ్చి జుట్టు నిమురుతోంది. కలా? కృష్ణుడు... రాధ—ఒకప్పుడు—మురళీగానంలో— తన్మయులై కలిసినట్లు—యీ పార్కులో— ఆమె, తనూ కలిశారు. ఆమె హృదయం తనదే కాబోలు!— శేఖరం ఆలోచనలో తన్మయుడైయాడు..

'నేనెందుకు మర్చిపోతాను?'

'మరి... జరిగిన పని?'

'ఏంచేస్తా? మావాళ్ళు వివాహం చేసేశారు. మీరు..'

"చెప్పాగా...నీ వివాహానికి పదిరోజులు ముందుగా చేసుకుంటానని. అభిమాన ముంటే ఏ ఆడది కాదనగలదు?"

"కానీ నేను అబలను... పెద్దలమాటలు కాదనలేను. జరిగిన నిర్ణయం కూలదోస్తే వాళ్ళకు కళంకం కాదూ!"

"జరిగిన నిర్ణయం జరిగింది. నీ పెళ్ళి అయింది. ఇప్పుడు నన్నెందుకు తలచుకోడం, పలకరించకండి?"

"మనస్సులో మెదలుతోంటే, చూడబుద్ధి పుడుతుంది"

"దొంగమాటలు, దొంగబుద్ధి"

"మీదికాదూ? పరాయిస్త్రీని నన్ను చూడాలని మీకెందుకూ యీబుద్ధి?"

అమె వెక్కిరించింది.

శేఖరం నవ్వేశాడు. ఆమె వెక్కిరింపు అతనికోపం పోగొట్టింది.

"చూడు" శేఖరం లాలనగా అన్నాడు.

"చూస్తున్నాగా మిమ్మల్నినే మనసారా, జీవితంలో ఒకసారి ఈసారి. ఇటువంటి సారి మళ్ళీ రాదేమో--"

"అదికాదు--"

"మరిఏది?-అద్దా-కొలను"

'చూడు యీ కేకుగీకు ఏమిటో నాకిష్టం'

"గీకు అంటే"

నవ్వేశాడు శేఖరం-

"కేకులోపల ఉన్నది గీకు !"

"అదేదో నాకు గ్రీక్ లా ఉంది !"

"ఊఁ, ఎలా వుంది నీ సంసారం... పిల్లలా ?"

"ఒక పాప వుంది"

"చూపించావు కాదే !"

"వస్తేగా...ఎప్పుడైనా యింటికి రండి"

'రావచ్చా'

"అదేం ? నా కోసం ఎందరో వస్తుంటారు"

"నాలాంటి వాళ్ళే ?"

"ఆ...అవునుపాపం!" నెత్తిమీద కొట్టింది ఆమె...

"నేను వస్తే నీ పిల్లా గిల్లా, నీ భర్తా, గిర్తా కోప పడతాడు !"

'గిల్లా, గిర్తా అంటే ఎవరండి?'

నవ్వేశాడు శేఖరం...

'మీరు తెలుగు యిల్లాగే నేర్చుకుని పరీక్షలు ప్యాస యారా!'

'తెలుగులో వీటిని వికృతులంటారులే!'

'పాపం! కొత్త డిక్షనరీ రాయకూడదూ?'

'ఆ ప్రయత్నమే చేస్తున్నా...'

ఇద్దరూ నవ్వుకున్నారు.

'మనం ఎన్నాళ్ళయింది కలుసుకుని?' శేఖరం ప్రశ్నిం చాడు.

'సంవత్సరం న్నర!'

"నేను నీకు జ్ఞాపకం ఉంటానా?"

"నిత్యం"

"ఎలా..."

'నీ కన్నీరు నాకు కనిపిస్తుంది-నేను ఆనందంగా ఉన్నప్పుడు ... హఠాత్తుగా మౌనం వహిస్తుంటా చుట్టు ప్రక్కల జనం తెలుసుకోకుండా!'

'నా కన్నీరు నీ ఆనందానికి శాపంలా వుందా? నీ ఆనందం చెడగొడుతున్న దుర్మార్గుణ్ణి...నన్ను చంపెయ్య కూడదూ!'

'అదే నేనూ అడగాలనుకుంటున్నా!'

'సరే... ఒకరినొకరిని మనం చంపుకోలేం... మనిద్దరినీ ఎవరైనా చంపేస్తే బాగుంటుంది...'

ధన్‌మని శబ్దమయింది. దారినపోయే కుర్రాడు నేల టపాకాయి పేల్చాడు.

కొలనులోని కొంగలు ఎగిరాయి. చెట్టుమీది పక్షులు చెట్టు కుదిపాయి. శేఖరం నెత్తిమీద పెద్ద రెట్టరాలింది. ఆ దుర్గంధంతో ఆలోచనలనుంచి తేరుకున్నాడు... శేఖరం. ఆమె నెత్తుకుపోయిన రెండంతస్తుల బస్సు ఈ పాటికి గమ్యస్థానం చేరుకుని ఉంటుంది. ఆలోచనగా లేచాడు.

దూరంగా మరో బెంచిమీద ఒకడు హాయిగా సాచుకు పడుకుని కూనిరాగం తీస్తున్నాడు. పల్లెటూరి యౌవనజంట ఒకటి మతాబాలకట్ట పొందికగా పట్టుకుని పార్కులో విహారం చేస్తూ మొక్కలన్నీ చోద్యంగా చూస్తున్నారు. దూరంగా రెండు కుక్కలు ప్రణయ కలహమాడుకుంటున్నాయి.

శేఖరం ఆమెను తలచుకున్నాడు. కన్నీరు కార్చాడు.

అతని కన్నీరు జారింది. బొట్లు బొట్లుగా కొలనులోకి జారిన ప్రతీబొట్టు. నీటిని చెదిర్చి, కెరటాల కంచంలా వ్యాపించుకుంది.

పెళ్ళినాడు ఆమెకు ఒక వెండికంచం బహుమతి యివ్వాలనుకున్నాడు. స్వయంగా తానే పెళ్ళిచేసుకుంటే.

కాని యివ్వలేము, మరొకటి యిచ్చాడు, యిచ్చే అర్హత లేకపోయినా.

ఆ వెండి కంచంలో కలిసి భోంచేయా లనుకున్నాడు శేఖరం. ఎదురుగా కన్నీటి బిందువులు రాల్చటంవల్ల రాల్చిన కన్నీటి కెరటంలో ఆమె ప్రతిబింబం అతనికి కట్టింది.

వెండి కంచంలో... మెరిసే కంచంలో ఆమె కలిపి ముద్ద పెడుతోంటే... ఆ ముద్దమాని... ఆమె ముద్దుముఖం కంచంలో చూడాలన్న కల... యీనాడు... ఆ కన్నీటి కెరటం కంచంలో మగోలా... దుఃఖావేదనలో... ఒంటరిగా- ఊహాగానంలో — బాధలమానంలో- ఖిన్నుడైనాడు శేఖరం...

వెనకనుంచి హఠాత్తుగా అతని పీక నొక్కినట్లయింది ఎవరో!

కెవ్వువ గట్టిగా అరిచాడు, భయంతో, భ్రమా, నిజమా అని గందరగోళ పడ్డాడు, చిరిగిన వస్త్రాలతో, రేగిన జుట్టుతో బికారి, ఉన్మాదిని క్రూరంగా, కోపంగా- చూస్తోంది అతనివైపు. శేఖరానికి అర్థం కాలేదు.

"నువ్వు-నిన్ను చంపేస్తా-నువ్వే - మదన్ - మదన్ - నేనిలా అయిపోయాను" ఏడ్చింది ఆ ఉన్మాదిని. ఏడుపు హఠాత్తుగా ఆపింది. శేఖరం దగ్గరిగా వచ్చింది. ముఖం లోకి తేరిపారి చూసింది.

'కాదు .. నువ్వు మదన్ కాదు' శరీరమంతా పరీక్ష చేసింది.

"నన్ను క్షమించు బాబూ!" శేఖరం కాళ్ళమీద పడింది ఆ ఉన్మాదిని.

"ఫరవాలేదు ... లే... లే." కసిరాడు శేఖరం.

లోపలి భయం కొంచెం తగ్గింది.

ఆస్త్రీ ఎవరో పిచ్చిది.

ఆ స్త్రీకి మతి చెడింది. ఆ మతిచెడిన స్త్రీ... తాను ఆమె గురించి ఆలోచించు కుంటుంటే- ఆ స్త్రీ లేచింది- అతని కాళ్ళమీదనుంచి.

ఆమె వక్షోజాలు స్ఫుటంగా కనిపిస్తున్నాయి. మోకాలు దాకా ఉన్న వస్త్రం మాసిపోయింది. మౌనంగా కాస్సేపు బెంచీమీద కూర్చుంది.

'నీ దేవూరు-పేరు?' శేఖరం ఆమెను ప్రశ్నించాడు.

ఆ స్త్రీ మాట్లాడ లేదు...

'మదన్... అబ్బా' గుండె పట్టుకుని బాధగా విలపించింది గట్టిగా, ఏడ్చింది.

శేఖరం గాభరా పడ్డాడు. ఎవరైనా వస్తారేమోనని-తాను ఆ స్త్రీని హింసిస్తున్నట్లు అనుమాన పడతారేమోనని కంగారు పడ్డాడు.

ఇంతలో ఆమె పకపక నవ్వింది.

వేడివేడి జంతిక లమ్మేవాడు కేక పెట్టాడు.

"నాకో జంతిక కొనిపెట్టవ్, ఆకలేస్తోంది!"

శేఖరానికి జాలివేసింది.

జంతిక కొనియిచ్చాడు...

ఆ స్త్రీ తింటోందా జంతిక.

"మా అమ్మ కమ్మని జంతికలు కొనిపెట్టేది. నువ్వూ కొనిపెట్టావు. నువ్వూ మా అమ్మా ఒకటే. కాని నువ్వు ఆడదానివి కాదు... నాకు తెలుసు క్రాపు వుందిగా!"

పకాపకా నవ్వింది, ఆ స్త్రీ.

జంతిక తింటోంది.

"ఇదిగో, నేను, బెంగుళూరులో ఒక రోజు గుఱ్ఱప్పందేల కెళ్ళాను. మదన్ లేడూ! వాడు తీసుకెళ్ళాడు. ఆవేళ నా మెళ్ళో గొలుసు అమ్మి పందాలాడాను. కాని... కానీ... రాలేదు లాభం. మరో రోజు గాజులమ్మాను. మరొకదినం నా బనారసు సిల్కు చీరలన్నీ అమ్మేశాడు." ఆమె జంతిక కరకర శబ్దం చేస్తోంది. "నేనేమో నే-మా వూళ్లో చెరువులో యీతాలాడేదాన్ని. అప్పుడు మదన్ - నేనూ ఎంతో సరదాగా ఉండే వాళ్ళం. దొంగవెధవ బెంగుళూరులో నన్ను ఒకసానిదానికి ఒప్పజెప్పి మాయమై పోయాడు. అప్పటి నుంచి కనపడలేదు. నేను ఆభోగందాన్ని అప్పడాల కర్రతో ఒళ్ళు హూనం చేసి పారిపోయి వచ్చేశాను!" 'అహ' ఒళ్ళంతా కదిలేలా నవ్వింది -

జంతిక అయిపోయింది –

ఒక క్షణం నిట్టూర్పు విడిచింది. ఎదురుగా కొలను లోని నీరు త్రాగింది. గబుక్కున దోసిళ్ళోకి తీసుకొని_ ఆ మురికి నీరు ఆ స్త్రీకి మురికిలా తోచలేదు !

చేతుల మురికి బట్టలకు రాసుకుంది.

చెట్టు నుంచి రాలిన ఎండుటాకులు తీసుకొని శిరోజా లలో దూర్చుకుంది. 'నేను అందంగా ఉన్నానా?'

నవ్విందా స్త్రీ.

"నువ్వెక్కడుంటావ్?... నేనూ రానా నీతో... నా కేదైనా కూలిపని యివ్వవూ!...నువ్వెందుకిస్తావులే...నీకే తికానా లేదేమో!...ఏంబై రాగీ! అలా చూస్తావేంటి గుడ్లప్ప గించి...దొంగ గుడ్లు మదన్‌లాగే!.. తూ మీ మొగవాళ్ళని నమ్మరాదు...ఫో యిక్కడనుంచి...జంతిక పెట్టాడు. ఇది జంతికా! విషమా... నేను చస్తానేమిటి!!!...ఫోరా...ఫో... ఆ స్త్రీ చెట్టుకొమ్మ విరచి శేఖరం ఒంటిమీద కొట్టింది. రెండుసార్లు... శేఖరం నిశ్చేష్టుడై ఆమెను పరిశీస్తూ నిలు చుండి పోయాడు.

ఆ స్త్రీ అతని కళ్ళల్లోకి నిశితంగా చూసింది.

"అదేమిటి? అలా చూస్తావు ... బలే అందంగా ఉన్నావులే! పకపక నవ్వుతూ తూలుతూ-పోతా...పోతా...," అంటూ ఎగురుతూ నిష్క్రమించింది ఆ స్త్రీ. సాయంత్రం పడింది.

ఆకాశం సంధ్యారాగం పులుముకుంది.

టపాకాయల ప్రేలుడు శబ్దాలు దూరాన వినవస్తున్నాయి.

ఆకాశములోకి తారాజువ్వలు ఎగురుతున్నాయి. రోజుకుంటూ.

ఆ స్త్రీలాగా తనకూ పిచ్చి ఎక్కుతుందేమో! పిచ్చి ఎక్కితే- యిలాగే గంతులేస్తూ, అరుస్తూ బాధపడుతూ, ముష్టిఎత్తుకుంటూ- చిరిగిన పీలికలతో భరింపరాని బ్రతుకు. శతృవుకైనా వద్దు. శేఖరం ఆర్ద్ర హృదయం కుమిలింది.

గంతులేస్తూ పారిపోయిన ఆ ఉన్మాదిని కోసం వెతికాడు పార్కుఅంతా.

ఆ స్త్రీ జాడలేదు. ఆ స్త్రీ కనిపించితే ఆమెను ఎక్కడైనా ఆస్పత్రిలో చేర్చి, నయంచేసి యింట్లో దాసిగా నియోగించుకుంటే ?

ఆ చీకటిలో, ఆ ఆలోచనల్లో ఆ స్త్రీని పట్టుకుని టాక్సీ ఎక్కించి ఆస్పత్రికి తీసుకు వెళ్లాడు శేఖరం. ఆమె ఎదురుగా స్టెతస్కోపుతో గదిలో ప్రత్యక్షమయింది....

"ఇలా వచ్చారే ?"

"ఈమెను తీసుకువచ్చాను."

"ఎవరు"

ఆమె మీద కసి తీర్చుకోవాలను కున్నాడు శేఖరం.

"నేను ప్రేమించిన స్త్రీ"

ఆమె శేఖరం కళ్ళల్లోకి అసూయాగ్నితో బాధగా చూసింది అల్లా చూడ్డానికి ఆమెకు హక్కేముంది? లోలో పల గొణుక్కున్నాడు శేఖరం.

"ఈ కేసు నేనుచూడను. మరో డాక్టరు వస్తారు!" ఆమె రుసరుసలాడుతూ వెళ్ళిపోయింది. అంత కోపంతో ఆమె మందయానం... ఆ తెల్లని చీరలో అప్సరసలా గోచ చించే ఆమె, ఆ డాక్టరు, శేఖరం తన్మయుడై పోయాడు...

"నన్ను క్షమించవూ... ఆమె ఎవరో పిచ్చిది... జాలి వేసి తీసుకువచ్చా!"

"అవును, నీదయను ప్రశ్నించడానికి నాకేం హక్కు ఉంది?" శేఖరం నవ్వుకున్నాడు...'బలే డాక్టరు' ఆలోచ నలు హఠాత్తుగా తెగిపోయాయి.

'రిక్షా కావాలా బాబూ!' ఎదురుగా రిక్షావాడి యాచన.

ప్రేమ భిక్ష దొరకని శేఖరం రిక్షావాడికి కృషి భిక్ష పెట్టదలచుకున్నాడు.

కనుపించని ఉన్మాద స్త్రీ అతను చీకటిలో ఎక్కడో కలిసిపోయి ఉంటుందనుకున్నాడు... రిక్షా మువ్వలచప్పుడు ఆమె గాజుల గలగల ధ్వనులు మెదిలాయి చెవులో.

ఆకాశంలో ఏవో బాణా సంచా జిలుగులు కనిపించాయి. కలిసి విడిన ఆ వెలుగు కణాలు అతని కన్నులలో మెరిసాయి. చనిపోయాక, బహుశా యిద్దరం ఆకాశంలో అలా గాలిలో తేలుతూ కలుసుకోవచ్చు అనుకున్నాడు శేఖరం.

శేఖరం కనుకొనల్లో నిలుచున్న బాష్పకణాలు దీపాల వెలుగుల్లో ఏవో మెరుపు గుళికల్లా నిలిచాయి.